


అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో విజయనగరం విజయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజ్జీ క్రికెట్ మైదానంలో ఈనెల 2 నుంచి నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీలో విజయనగరం జిల్లా జట్టు ప్రకాశం జిల్లా జట్టుపై 138 పరుగులు తేడాతో విజయం సాధించింది. మూడు రోజుల ఫార్మెట్‌లో జరుగుతున్న టోర్నీలో తొలి ఇన్నింగ్స్ లో విజయనగరం జిల్లా జట్టు 255 పరుగులు సాధించగా ప్రకాశం జిల్లా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 161 పరుగులకు ఆల్ అవుట్ అయ్యింది. రెండో ఇన్నింగ్స్ లో విజయనగరం జిల్లా జట్టు 210 పరుగులకు ఆల్ అవుట్ కాగా, ప్రకాశం జిల్లా జట్టు మూడో రోజు గురువారం 166 అడుగులకు ఆల్ అవుటై 138 పురుగుల తేడాలతో ఓటమి పాలయ్యింది. విజయనగరం జిల్లా జట్టును, కోచ్ బహదూర్ ను జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎమ్ఎల్ఎన్ రాజు, ట్రెజరర్ పి.సీతారామరాజు, సెలెక్టర్లు వర్మ, సర్ఫ్రాజ్, బంగార్రాజులు అభినందించారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

స్వచ్ఛందంగా సహకరించిన ప్రయివేటు, ప్రభుత్వ విద్యాసంస్థలు
నీట్‌ను రద్దు చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిరసన ప్రదర్శనలు



విజయనగరంలో బంద్‌తో మూతపడిన జూనియర్ కళాశాల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అవతవకలు జరిగిన నీట్ 2024 పరీక్షను, దాన్ని నిర్వహించిన ఎన్‌టిఎ సంస్థను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యాన గురువారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయనగరం జిల్లాలో జయప్రదమైంది. నగరంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. వేలాదిమంది విద్యార్థులు తరగతులు బహిష్కరించి బంద్ లో పాల్గొన్నారు. నీట్ స్కాంపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ని రద్దు చేయాలని కోరుతూ కోట జంక్షన్ వద్ద ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.రాము, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగభూషణం, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు గణేష్, పిడిఎఫ్ నాయకులు రాకేష్ మాట్లాడారు. దేశంలో ఇంత పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమవుతున్నా కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇప్పటివరకు ఈ విషయంపై స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. కీలకమైన పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీక్‌లకు కారణమవుతున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ని తక్షణమే రద్దు చేయాలని, వాటి స్థానంలో గతంలో రాష్ట్ర ప్రభుత్వాలు సీట్లు కేటాయించే హక్కును కలిగి ఉండేవో ఆ హక్కును తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జాతీయ విద్యా విధానం పేరుతో దేశవ్యాప్తంగా మూసివేసిన పాఠశాలలను తిరిగి తెరిపించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి ఈ డిమాండ్ల సాకారానికి కృషి చేయాలని, లేదంటే పెత్తఎత్తున ఉద్యమం చేపడతామని తెలిపారు.అనంతరం సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ, ప్రభుత్వ మెడికల్ కళాశాలలో విద్యార్థులతో ఆందోళనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె.రవికుమార్ పి.రమేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గౌరీ, పట్టణ కార్యదర్శి సుమన్, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు కె.రాజు, నాయకులు కల్యాణి, సుస్మిత, భాను, వెంకటరమణ, గుణ, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బొబ్బిలిలో భారత్ బంద్ సంపూర్ణంగా జరిగింది. బొబ్బిలి పట్టణంలోని స్టేట్ బ్యాంక్ దగ్గరలో ఉన్న అంబేద్కర్ బొమ్మ జంక్షన్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.కిరణ్, కె.మణికుమార్, ఎఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రావణ్, భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : విద్యాసంస్థల బంద్‌ను వేపాడ మండలంలో విజయవంతమైంది. మండలంలోని విద్యాసంస్థలన్నీ మూతపడ్డాయి. ఎస్ఎఫ్ఐ నాయకులు కార్తీక్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : పట్టణంలో ఎస్ఎఫ్ఐ చేపట్టిన భారత్ బంద్ విజయవంతమైంది. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.సమీరా, మండల గర్ల్స్ కన్వీనర్ భారతి, నాయకులు అను, రత్న, రాంబాబ విజయ్, రిషి, రవి, నాయుడు పాల్గొన్నారు.

జామి : దేశ వ్యాప్త విద్యాసంస్థల బంద్ జామి మండలంలో అన్ని విద్యాసంస్థల్లో విజయవంతంగా జరిగింది. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ ఉపాధ్యక్షులు వి.చరణ్, మండల నాయకులు రవి, అనిల్, చరణ్, రాజు, దినేష్, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : మండలంలో విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.రమేష్, మండల నాయకులు గణేష్, దీపక్, తేజ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.





విజయనగరం, బొబ్బిలిలో నిరసన ప్రదర్శనలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

నిలిచిన బిల్లులు

- రావాల్సింది రూ.17 కోట్లు
- అప్‌లోడ్ కోసం మరో రూ.2.65 కోట్ల బిల్లులు సిద్ధం
- పనుల్లో నాణ్యతపై కొత్త పాలకుల దృష్టి
- గత ప్రభుత్వ నాయకుల బినామీలకు చిక్కులు



విజయనగరం కార్పొరేషన్ కార్యాలయం

ప్రజాశకి-విజయనగరం టౌన్

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గత ప్రభుత్వహయాంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు ఆగిపోయాయి. దీంతో పనులు చేసిన కాంట్రాక్టర్లు, కొందరు వైసిపి నాయకుల బినామీలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఇటీవల కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో బిల్లులు మంజూరవ్వని పాత పనుల నాణ్యతపై ప్రస్తుత అధికార పార్టీ నాయకులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. నగరంలో రహదారులు, సుందరీకరణ పనులలో నాణ్యత లోపాలు కన్పిస్తున్నాయని, వాటిని పరిశీలించాల్సిన అవసరం ఉందని, అందుకే బిల్లులను పెండింగ్‌లో పెట్టినట్లు తెలిసింది. వందల కోట్లతో అభివృద్ధి పనులు జరిగి ఉంటే మరి నాణ్యత ప్రమాణాల అమలు ఎలా ఉందన్న దానిపై అధికార పార్టీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలోనే గతంలోచేసిన అభివృద్ధి పనుల బిల్లుల అప్‌లోడింగ్ ఆపాలని ఆదేశించినట్లు తెలిసింది. గత ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పనుల బిల్లులను నూతన ప్రభుత్వం బాధ్యతలు చేపట్టక మునుపే అప్‌లోడ్ చేయించి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అనుకున్నప్పటికీ నేటికీ సిఎఫ్ఎంఎస్ ద్వారా రావాల్సిన బిల్లులు రాలేదు. నగరంలో జరిగిన అభివృద్ధి పనుల బిల్లుల్లో దాదాపు వైసిపిముఖ్య నాయకుడికి చెందిన బినామీలదే కోట్ల రూపాయలు ఉన్నాయని ప్రచారం జరుగుతుంది. గత ప్రభుత్వంలో సంవత్సరాలపాటు కాంట్రాక్టర్లు బిల్లుల కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది. గతంలో సదరు బినామీలు చేపట్టే ప్రతి అభివృద్ధి పని విషయంలో ముఖ్య నేత పేరు చెప్పి పబ్బం గడుపుకున్న వారందరూ ఇప్పుడు తలలు పట్టుకుని కూర్చొన్నారు. నాణ్యత ప్రమాణాలు లోపించిన నాశిరకం పనుల ఫైళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అవినీతి డొంక కదిలి తీరుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రూ.17 కోట్లు బిల్లుల కోసం కాంట్రాక్టర్ల ఎదురుచూపు

నగరపాలక సంస్థ చేపట్టిన అభివృద్ధి పనులకు రూ.17 కోట్ల బిల్లులు రావాల్సి ఉంది. ఏప్రిల్ నుంచి సిఎఫ్ఎంఎస్ ద్వారా రావాల్సిన బిల్లులు కోసం కాంట్రాక్టర్లు ఎదురు చూస్తున్నారు. దీనిలో ప్రధానంగా 15 వ ఆర్థిక సంఘం ద్వారా చేపట్టిన పనులకు రూ.5.98 కోట్లు, గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమం ద్వారా చేపట్టిన పనులకు రూ.3.53 కోట్లు, జనరల్ ఫండ్ ద్వారా చేపట్టిన పనులకు రూ..6.75 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.1.39 కోట్లు బిల్లులు రావాల్సి ఉంది. వీటితో పాటు మరో రూ.2.65 కోట్లు బిల్లులు అప్ లోడ్ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈనేపథ్యంలో బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారోనని కాంట్రాక్టర్లు రోజూ నగర పాలక సంస్థ కార్యాలయానికి రావడం, వెళ్లిపోవడం జరుగుతుంది. మరి బిల్లులు ఎప్పుడు వస్తాయో ఎదురు చూడడమే వారి వంతవుతోంది.

విద్యుదాఘాతంతో పారిశుధ్య కార్మికుడు మృతి

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని సింగవరం పంచాయతీకి చెందిన పారిశుధ్య కార్మికుడు దత్తి బంగారుబాబు(54) గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పంచాయతీ పరిధిలో లెంకపేట, జువ్వపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న బోరుబావి చుట్టూ ఉన్న గడ్డిని కోస్తుండగా కరెంటు వైర్ కొడవలికి తగులుకొని తెగిపోయింది. దీంతో బంగారు బాబుకు ఆ వైరు తగిలి అక్కడకక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానికులు 108 సమాచారమివ్వగా వారు వచ్చి పరిశీలించినప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

నష్టపరిహారం, ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్


విధుల్లో ఉంటుండగా విద్యుత్ షాక్‌తో బంగారుబాబు మృతి చెందడంతో ఆయన కుటుంబంలో ఒకరికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగంతో పాటు నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఎంపిడిఒ లవరాజు, శంకర్ జగన్నాథం, గ్రామ సర్పంచ్ అప్పారావు, గ్రామ కార్యదర్శి వసుంధర దేవి ఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మృతునికి భార్య లక్ష్మితో పాటు డిగ్రీ చదివిన కుమార్తె ఉన్నారు. కుమార్తెకు అవుట్ సోర్సింగ్‌లో ఉద్యోగం ఇవ్వాలని పంచాయతీ నుంచి రూ.10లక్షలు ఇవ్వాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. డిమాండ్లను నెరవేర్చకపోవడంతో ఉదయం 8గంటలకు సంఘటన జరిగినా నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ అక్కడే ఉన్నారు. చివరకు పంచాయతీ నుంచి కొంత సొమ్ము ఇవ్వడానికి, కుమార్తెకు సచివాలయంలో పారిశుధ్య కార్మికురాలుగా నియమించడానికి అంగీకరించారు. ఉన్నతాధికారులకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగం కోసం ప్రతిపాదన పంపిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. దీనికి అంగీకరించిన కుటుంబ సభ్యులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట ఆసుపత్రికి తరలించారు.

లాకౌట్ ఎత్తేయాల్సిందే

జిందాల్ యాజమాన్యాన్ని డిమాండ్ చేసిన సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి-కొత్తవలస

జిందాల్ యాజమాన్యం అక్రమ లాకౌట్‌ను వెంటనే ఎత్తేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. జిందాల్ పరిశ్రమను తెరిపించాలని కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 14వ రోజుకు చేరాయి. ఈ దీక్షలకు తమ్మినేని సంఘీభావం ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిందాల్ పరిశ్రమకు లాకౌట్ ప్రకటించి 49 రోజులైందని, కార్మికులను అర్ధాంతరంగా యాజమాన్యం రోడ్డున పడేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. లాకౌట్ పేరుతో కార్మికులను బయటకు నెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. ఏళ్ల తరబడి నమ్మకంతో పనిచేసిన కార్మికులను పొమ్మన లేక పొగ పెట్టడం విచారకర మని అన్నారు. 40 సంవత్సరాలుగా కార్మికుల శ్రమ దోచుకుని, ఇప్పుడు ఒడిశా రాష్ట్రంలోని జాజిపూర్ వెళ్లాల్సిందేనని తెగేసి చెప్పడం విడ్డూరంగా ఉందని ఆక్షేపించారు. యాజమాన్యం దిగివచ్చి కార్మికులందరికీ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికుల సమస్యల పరిష్కారమయ్యే వరకూ సిపిఎం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, జిందాల్ జెఎసి నాయకులు పిల్లా అప్పలరాజు (టిఎన్‌టియుసి), గాడి అప్పారావు (సిఐటియు), నమ్మి చినబాబు, తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు మద్దతుగా దీక్షా శిబిరంలో కూర్చున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

పెంపుడు కుక్కలకు ఉచిత టీకాలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో జునోసిస్ దినోత్సవం సందర్భంగా ఈనెల 6న జిల్లాలోని 28,490 పెంపుడు కుక్కలకుఉచితంగా టీకాలు వేయనున్నట్లు పశు సంవర్ధకశాఖ జిల్లా సంయుక్త సంచాలకులు వైవి రమణ తెలిపారు. ఈ అవకాశాన్ని పెంపుడు కుక్కల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సమీప పశు వైద్య కేంద్రాలను సంప్రదించాలని తెలిపారు.

అల్లూరి ఒక పోరాట స్ఫూర్తి

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

దేశంలో అనేక మంది స్వాతంత్ర్య సమరయోధులు ఉన్నప్పటికీ అల్లూరి సీతారామ రాజు పోరాట విధానమే ఒక ప్రత్యేకమని, అందుకే అల్లూరికి అంత ప్రాముఖ్యత లభించిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పేర్కొన్నారు. అల్లూరి పేరు వింటేనే ఒక వీరత్వం, ఒక పోరాటం, ఒక స్ఫూర్తి స్ఫురణ కు వస్తుందని తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి ని ఘనంగా నిర్వహించారు. ముందుగా అల్లూరి చిత్ర పటానికి కలెక్టర్ అంబేద్కర్, డిఆర్ఒ అనిత, పలువురు జిల్లా అధికారులు పూల మాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అతి పిన్న వయసులో తన జీవితాన్ని త్యాగం చేసిన దేశ భక్తుడు అల్లూరి అని కొనియాడారు. బ్రిటీష్ వారి బానిస సంకెళ్ళ నుండి విముక్తిని పొందేందుకు పోరాటం చేసిన అల్లూరి చిర స్మరనీయుడని అన్నారు. డిఆర్ఒ అనిత మాట్లాడుతూ అల్లూరి కనిపించే శత్రువులతో పోరాటం చేశారని, ప్రస్తుతం కనిపించని శత్రువులు సమాజాన్ని చెడు మార్గంలోకి తీసుకువెళ్తున్నాయని, అలాంటి శక్తుల పట్ల జాగ్రత్త వహించాలని తెలిపారు. ముఖ్యంగా యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా మంచి మార్గంలో నడవాలని అన్నారు. గిరిజనుల, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సిపిఒ బాలాజీ, మెప్మా పీడీ సుధాకరరావు, డిపిఒ శ్రీధర్ రాజా, డిప్యూటీ కలెక్టర్లు రాజేశ్వరి, ప్రమీల, మురళి, సుమబాల, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి సందీప్ , పలు శాఖలకు చెందిన జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ ఆవరణలో అల్లూరి జయంతి ని పురస్కరించుకొని మొక్కలు నాటారు.



అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

జిల్లా పోలీసు కార్యాలయంలో..

జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది అల్లూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటం కోసం బ్రిటీష్ సామ్రాజ్యాన్నే ఎదురించిన మహానుభావుడు అల్లూరి అని కొనియాడారు. ఆయన చూపిన తెగువ, పట్టుదల మనందరికి ఆదర్శనీయమని, స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి యూనివర్స్, డిసిఆర్‌బి సిఐ జె. మురళి, ఆర్ఐలు ఎన్.గోపాల నాయుడు, ఆర్.రమేష్, టి.భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంటౌన్ : నగరంలోని దాసన్నపేట జంక్షన్‌లో గల అల్లూరి సీతారామరాజు విగ్రహానికి క్షత్రియ పరిషత్ ఆధ్వర్యాన కేంద్ర మాజీమంత్రి పి.అశోక్‌గజపతిరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు పాకలపాటి రఘువర్మ, పి.సురేష్‌బాబు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో కెఎపి రాజు, సాగి శివాజీ, సీతారామ రాజు, ఐవిపి రాజు, అప్పన్నబాబు, చంటి సూర్యనారాయణ రాజు, జిఎస్ ఎన్ రాజు, అరేటి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విప్లవ జ్యోతి అల్లూరి చిరస్మరణీయుడు

విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయు డని నగర మేయర్ విజయలక్ష్మి అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి మేయర్‌తో పాటు కమిషనర్ ఎం.ఎం. నాయుడు, సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, మున్సిపల్ అసోసియేషన్ అధ్యక్షుడు పట్నాల వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఎసిపి అమ్మాజీ రావు, టిపిఆర్ఒ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలు తెరిపిస్తా

ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా కేంద్రంలో మూతపడిన ఖోఖో, కబడ్డీ క్రీడా పాఠశాలను తెరిపించేందుకు కృషి చేస్తానని, నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. గురువారం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రీడా రాజీవ్ క్రీడా మైదానం, విజ్జి స్టేడియం, ఇండోర్ స్టేడియంలో కోచ్‌లు ఉన్నారా లేదా అని అడిగి తెలుసుకున్నామన్నారు. క్రీడా అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. అనధికార వ్యక్తుల చేతుల్లో ఇండోర్ స్టేడియం ఉన్నట్లు తెలిసిందని తెలిపారు. యువత చెడుమార్గం పట్టకుండా డ్రగ్స్ నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా అనధికారికంగా మైదానాలు చేతుల్లోకి తీసుకోవడానికి లేదన్నారు. కోలగట్ల వీరభద్రస్వామి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రెవెన్యూ శాఖ వారి సొంత ఇల్లు మాదిరిగా ఉండేదని, తమ పాలనలో అలాంటి పరిస్థితి ఉండదని అన్నారు. జిల్లా క్రికెట్‌టీములో ఇతర జిల్లాల క్రీడాకారులను ఆడిస్తున్నారని విలేకర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా విచారణజరిపి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వివిధ క్రీడల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను ఆమె సత్కరించారు. కార్యక్రమంలో డిఎస్‌డిఒ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రసూతి మరణాలపై కఠిన చర్యలు

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ • మాత, శిశు మరణాలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఇకనుంచీ జిల్లాలో ఒక్క ప్రసూతి మరణం సంభవించినా, సంబంధిత అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ హెచ్చరించారు. జిల్లా, డివిజన్ స్థాయి ప్రసూతి, పెరినాటల్ చైల్డ్ డెత్ సర్వైలెన్స్, రెస్పాన్స్ (ఎంపిసిడిఎస్ఆర్) కమిటీ సమావేశం గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. ఫిబ్రవరి, మార్చి, ఏప్రెల్ నెలల్లో జిల్లాలో ఏడు మాతృశిశు మరణాలు సంభవించగా, వాటిపై కలెక్టర్ సమీక్షించారు. ఆయా మరణాలకు కారణాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, ఇకనుంచి జిల్లాలో ఒక్క మాతృ, శిశు మరణం కూడా సంభవించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. సిబ్బంది నిర్లక్ష్యాన్ని విడనాడాలని, మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. మరణాల తరువాత సమీక్షించడం కంటే, వాటిని సంభవించకుండా అరికట్టడమే మనకు అత్యంత ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. వైద్యారోగ్య సిబ్బంది ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా, ఏమరుపాటుగా ఉన్నా ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని హెచ్చంచారు.ఇంత యంత్రాంగం ఉండికూడా మాతమరణాలు ఎందుకు సంభవిస్తున్నాయని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, అంగన్‌వాడీలు ఉండికూడా ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. జరుగుతున్న మరణాల్లో 90శాతం వరకు అరికట్టదగినవేనని ఆయన స్పష్టం చేశారు. ఇకనుంచీ ఎక్కడైనా ప్రసూతి మరణం సంభవిస్తే, సంబంధిత అధికారులు, సిబ్బందిపై క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడబోనని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ గౌరీశంకర్, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ అచ్చుతకుమారి, కమిటీ సభ్యులు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు



కంటకాపల్లి నర్సరీని పరిశీలిస్తున్న డ్వామా పీడీ

నర్సరీని సందర్శించిన పీడీ

ప్రజాశక్తి-కొత్తవలస

కంటకాపల్లి వద్ద గల సెంట్రల్ నర్సిరెడ్డి నర్సరీని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.ఉమామహేశ్వరి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సరీలో కావలసిన మొక్కలు ఉన్నాయని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. నర్సరీ యాజమాన్యం కూడా మొక్కలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం అప్పన్నపాలెం గ్రామంలో దన్నిన రామారావు పొలంలో వేసిన మామిడి సాగును ఆమె సందర్శించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ ఆఫీసర్ దుర్గాప్రసాద్, ఉపాధి ఎపిఒ జనార్దన్, జెఇ కేశవ, జగన్, ఎర్ని బాబు, హిందూ మతి తదితరులు పాల్గొన్నారు.



మట్టి రోడ్డును పరిశీలిస్తున్న పిఐయు ఎఇ మానస, ఇరిగేషన్ ఎఇ హేమకుమార్

మినీ బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

బానాది గెడ్డపై మినీ బ్రిడ్జి నిర్మాణానికి పిఐయు ఎఇ మానస, ఇరిగేషన్ ఎఇ హేమకుమార్ గురువారం స్థల పరిశీలన చేశారు. ఇటీవల ప్రజా దర్బార్‌లో కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు వినతి అందజేశారు. కలెక్టర్ ఆదేశాలతో మినీ బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. అనంతరం ఎఇ మానస మాట్లాడుతూ 2.30 కిలోమీటర్ల మేర మెటల్ వేయాల్సి ఉందన్నారు. దీంతో పాటు మినీ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలను కలెక్టర్‌కు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ఆతవ గ్రామ నాయకులు సిరికి రమణ, సామాజిక కార్యకర్త ఆర్.అప్పారావు పాల్గొన్నారు.

నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నూతన క్రిమినల్ చట్టాలపై పోలీసుల ఆధ్వర్యంలో గురువారం స్థానికపోలీసు స్టేషన్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ లో భోగాపురం రూరల్ సిఐ బి. వెంకటేశ్వరరావు ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన భారతీయ నయా సంహిత -2023 న్యూ క్రిమినల్‌లా పై అవగాహన కల్పించారు. నూతన చట్టాలను తప్పని సారిగా పాటించాలని, వాటిని అతిక్రమిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ డి. రామ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సారిపల్లిలో ఈనెల 5న విద్యుత్ అంత రాయానికి వినియోగ దార్లు సహకరించాలని సబ్ స్టేషన్ ఎఇ పిచ్చయ్య కోరారు. చెట్ల కొమ్మలు తొలగించే పనుల నిమిత్తం సారి పల్లి రూరల్ ఫీడర్11కెవి పరిధిలో శుక్రవారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

పోతనాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో

శృంగవరపుకోట : మండలంలోని పోతనాపల్లి సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ విజయనగరం రూరల్ ఇఇ జి.సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. సీతంపేట, వినాయకపల్లి, దొగ్గపేట, తలారి, ఉసిరి, ఎస్.జి.పేట, వెంకటరమణపేట, కొత్తూరు, శివరామరాజుపేట, వశి, తిమిడి, వేచలపూడి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు.

రేపు ఉచిత రక్త పరీక్షలు

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక నారాయణి హృదయాలయ ఆస్పత్రిలో శనివారం ఉచితంగా రక్తపరీక్షలు నిర్వహించనున్నట్లు గుండె వైద్య నిపుణులు పెంట సునీల్ కుమార్, ఇమ్యూనోహెమాటలజీ డాక్టర్ బండారు లావణ్య ఒక ప్రకటనలో తెలిపారు. బిపి, మధుమేహం, హెచ్‌బి1సి, లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలు ఉచితంగా చేస్తామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి-గంట్యాడ

గ్రామంలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పెద్దమజ్జిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇఒ రాజ్ అన్నారు. మండలంలోని బోనంగి గ్రామంలో డెంగీ మాసోత్సవాల సందర్భంగా గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు ఎక్కువగా వ్యాపిస్తాయని చెప్పారు. వీటి నివారణ కోసం పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేసుకోవాలన్నారు. ఆరోగ్య సహాయకులు ఈశ్వర రావు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎస్ తిరుపతి, ఎంఎల్‌హెచ్‌పి హరీష్ పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

విజయనగరం : సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పట్టణ నిరాశ్రయుల భవనానికి సుమారు పదిహేను రోజులకు సరిపడా నిత్యావసర వస్తువులను క్లబ్ అధ్యక్షులు తాడ్డి ఆదినారాయణ, క్లబ్ కోశాధికారి ఆర్.సి.హెచ్ అప్పలనాయుడు గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ జిల్లాలో వెలకట్టలేని సేవలు అందిస్తున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రకృతి సాగు పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని రాయుడుపేట, వీలుపర్తి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగుచేసిన పంటలను గురువారం ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ ఎం.ఆనందరావు పరిశీలించారు. నువ్వుల్లో అంతర పంటలు, వరికి ముందు వేసిన నవధాన్యాల సాగును పరిశీలించారు. నవధాన్యాల సాగుతో నేలకు లభించే పోషకాలు, వివిధ ఉపయోగాల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వరప్రసాద్, వసంత, సన్యాసమ్మ, ఈశ్వర్, రాము, దేముడు, లక్ష్మణమ్మ, రామలక్ష్మి పాల్గొన్నారు.

భూముల రీసర్వే రద్దు చేయాలి

ప్రజాశక్తి-రామభద్రపురం

భూముల రీసర్వే పేరిట గత ప్రభుత్వం చేపట్టిన సర్వేను రద్దు చేయాలని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు మజ్జి రాంబాబు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు తహశీల్దార్ సులోచనారాణికి గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూ సర్వే అనేక లోపాలతో చేపట్టడం వల్ల రైతుల ఇక్కట్లు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు. భూవిస్తీర్ణంలో హెచ్చుతగ్గులు నమోదు అయ్యాయని, దీనివల్ల అవసరం మేరకు భూములు అమ్మకాలు, కొనుగోళ్లు చేసే సమయంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన చెందారు. రిజిస్ట్రేషన్లు జరగక, అత్యవసర పరిస్థితుల్లో నగదు దొరక్క రైతులు ఇక్కట్లకు గురవుతున్నారన్నారు. భూ రికార్డులు తప్పుల తడకగా నమోదైనట్లు వివరించారు.

జ్యూట్ మిల్లు క్వార్టర్స్‌లో చోరీ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

స్థానిక జ్యూట్ మిల్లు క్వార్టర్‌లో బుధవారం రాత్రి బంగారం, వెండి నగలు చోరీకి గురయ్యాయి. గురువారం స్థానిక ఎస్ఐ డి. రామ గణేష్ తెలిపిన వివరాలు ప్రకారం జ్యూట్ మిల్లు క్వార్టర్‌లో రంజిత్ కుమార్ చౌరాసియా అనే వ్యక్తి ఇంటిలో దొంగలుపడ రెండున్నర తులాల బంగారం, 16తులాల వెండి దోచుకున్నట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు 24గంటల్లో నిందితులు పందిరి ప్రసాద్ (చిన ముషిడివాడ), నక్క ప్రసాద్ (థామస్ పేట)లను పట్టుకొని వారి నుంచి బంగారం,వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మెట్ట సబ్బన్నపేట జంక్షన్ వద్ద లారీ బోల్తా

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని భోగాపురం నుంచి ముక్కాం వెళ్లే రహదారిలో మెట్ట సబ్బన్నపేట జంక్షన్ వద్ద గురువారం వేకువజామున లారీ బోల్తా పడింది. సమీపంలో ఉన్న ఒక క్వారీ నుంచి రాయి పిక్క లోడ్‌తో వస్తుండగా ఈ జంక్షన్ వద్ద ఎల్ ఆకారంలో ఉన్న భారీ మలుపు వద్ద తిప్ప లేక సడన్‌గా బ్రేక్ వేయడంతో ఒక్కసారిగా బోల్తా పడింది. అందులో ఉన్న డ్రైవర్ చాకచక్యంగా ఈ ప్రమాదం నుండి తప్పించుకున్నాడు. దీనిపై పోలీసులను సంప్రదించగా ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

అల్లూరి స్ఫూర్తితో పోరాటం

ప్రజాశక్తి-బొబ్బిలి

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో విద్యా రంగ సమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి కోరారు. గురువారం అల్లూరి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిజనుల సమస్యలపై అల్లూరి పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, కృష్ణదాసు, రమేష్, మధుసూదన్, కేశవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో.. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, కమిషనర్ ఎల్.రామలక్ష్మి, మున్సిపల్ ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొత్తవలస : తహశీల్దార్ కార్యాలయం వద్ద అల్లూరి విగ్రహానికి ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొత్తవలస సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, ఎంఇఒ జి.శ్రీదేవి, వ్యవసాయ శాఖ ఎడి ఎల్.విజయ, సిఐ చంద్రశేఖర్, డిప్యూటీ తహశీల్దార్ రమేష్, డాక్టర్ టి.సుబ్బారావు, కోరుపోలు అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : ఎంపిడిఒ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఎంపిడిఒ నిశ్చల పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఉమ, ఎపిఒ ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం : ఎంపిడిఒ కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి ఎంపిడిఒ మధుసూదన్ రావు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. పెరుమాలి గ్రామంలో అల్లూరి విగ్రహానికి ఎస్ఐ రమేష్, సర్పంచ్ ప్రతినిధి అప్పల నరసింహారావు పూలమాలవేసి నివాళులర్పించారు. మాజీ ఎంపిటిసి జగ్గరాజు జగన్నాథ రాజు పాల్గొన్నారు.

జామి : ఎంపిడిఒ తిరుమలరావు ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ ఎఇఒ నరసింహ, సిబ్బంది పాల్గొన్నారు.

డెంకాడ : అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను స్థానిక ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, గ్రంథాలయాధికారి మహేష్ పాల్గొని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నెల్లిమర్ల: అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకలు గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం లో ఘనంగా నిర్వహిం చారు. నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ అల్లూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొండగుంపాంలో సిపిఐ నాయకులు మొయిద పాపారావు ఆధ్వర్యంలోని అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు నిర్వహించారు.

సంతకవిటి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుకు ఎఒ రఘునాద్ ఆచారి, సిబ్బంది పుష్పాంజలి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేస్తున్న యుటిఎఫ్ నాయకులు విజయగౌరి

అల్లూరి వారసత్వాన్ని కొనసాగిస్తాం

విజయనగరం టౌన్ : స్వాతంత్ర్య పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు వారసత్వాన్ని కొనసాగిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు అన్నారు. దాసన్నపేటలో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు కలలు గన్న సోషలిస్టు సమాజ స్థాపన కోసం భారత దేశంలో కృషి చేస్తున్నది కమ్యూనిస్టు లేనని అన్నారు. ఆనాడు విదేశీయులు వ్యాపారం చేసుకొని ప్రజల సంపద దోచుకుంటే నేడూ విదేశీ సామ్రాజ్య వాదులు, స్వదేశీ పెట్టుబడి దార్లూ దోచుకొని దేశంలో పేదలను మరింత పేదలుగా మార్చేస్తున్నారని అన్నారు. వీటికి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలను, కార్మికులను చీల్చడానికి బిజెపి, ఆర్ఎస్ఎస్ మతోన్మాద శక్తులు ప్రజల ఐక్యతను ముక్కలు చేస్తున్నాయని అన్నారు. కావున మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడి, రాజ్యాంగాన్ని కాపాడడమే అల్లూరికి నిజమైన నివాళి అని అన్నారు, కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎ.జగన్మోహన్, బి.రమణ తదితరులు పాల్గొన్నారు.



అల్లూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న సిపిఎం నాయకులు శంకర్రావు, జగన్మోహన్

సమస్యల పరిష్కారానికే జనవాణి

ఎమ్మెల్యే లోకం నాగ మాధవి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి 'జనవాణి మాధవమ్మ భరోసా' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. గురువారం మండలంలోని చల్లవాని తోటలో సర్పంచ్ పతివాడ వరలక్ష్మి ఆధ్వర్యంలో జనవాణి మాధవమ్మ భరోసా కార్యక్రమం ప్రజల సమక్షంలో నిర్వహించారు. మీ సమస్యలు చెప్పుకోవాలని ఆమె ప్రజలకి చెప్పారు. దీంతో గ్రామపంచాయతీలో ప్రజా సమస్యలను ఆమె ముందు ఏకరువు పెట్టారు. రైతు భరోసా కేంద్రం నూతన భవనం మంజూరు చేయాలని, తాగునీరు కాలువలు అంగన్వాడీ భవనాలు తదితర సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఆమె స్పందించి తాగునీరు పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు ఆదేశించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శాఖ పంచాయతీరాజ్ శాఖ అని దానిపై ప్రత్యేక దృష్టి పెడతామని ప్రతి పైసా ప్రజలకు ఉపయోగపడేలా చూస్తామని అన్నారు. గ్రామంలో ఎంత ప్రభుత్వ భూమి ఉందో తెలుసుకొని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ చేయడానికి చర్యలు చేపడతామన్నారు. యువత ఉపాధిపై ప్రత్యేక శ్రద్ధ పెడతానన్నారు. గ్రామీణ ప్రజలంతా స్వయం ఉపాధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా పాడి పరిశ్రమ, కూరగాయలు సాగుపై దృష్టి పెట్టాలన్నారు. అందరూ ఉద్యోగాల మీదే ఆధారపడకుండా స్వయం ఉపాధి పై ఆధారపడాలని సూచించారు. ప్రజలు కూడా బాధ్యతాయుతంగా అధికారులతో పనిచేయించుకోవాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో ఎలక్ట్రికల్ స్తంభాలు సమస్య, గృహ నిర్మాణాలకు సమస్యగా ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల నాయకులు పతివాడ శ్రీను మాట్లాడుతూ గ్రామంలో వీధిలైట్ల సమస్య ఉందని మెర్క్యురీ లాంప్ లాంటివి ప్రొవైడ్ చేయాలని కోరారు. రైతులు బోర్లు వేయించుకునేందుకు ఫారం ఫ్రీ ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నెల్లిమర్ల ఇంచార్జ్ బంగార్రాజు, రెల్లివలస సర్పంచ్ భర్త ఇజ్జురౌతు ఈశ్వరరావు, జనసేన మండల పార్టీ అధ్యక్షులు శివ, స్మార్ట్ రమేష్, తహశీల్దార్ ప్రవల్లిక, పంచాయతీ అధికారి శ్రీనివాసరావు గ్రామస్తులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే లోకం మాధవి

పశు అక్రమ రవాణాను నివారించాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-బొబ్బిలి

పశువుల అక్రమ రవాణాను నివారించాలని ఆర్‌డిఒ ఎ.సాయిశ్రీ అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో గురువారం జంతు సంక్షేమ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మానాపురం సంత నుంచి పశువుల అక్రమ జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని, అడ్డుకోవాలని కోరారు. పశువులకు అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోడి, గొర్రె పందేలను అడ్డుకోవాలన్నారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ గోసంరక్షణ సమైక్య సభ్యులు కెవిఆర్ సత్యనారాయణ, పశు సంవర్ధక శాఖ ఎడి నీలయ్య, డిప్యూటీ డిఇఒ కె.మోహన్‌రావు, తహశీల్దార్ వి.త్రినాథ్‌రావు, ఎస్ఐ జి.లోవరాజు, ఆర్ఐ కె.కళ్యాణ్‌చక్రవర్తి, దత్తిరాజేరు ఇఒపిఆర్‌డి ఆర్.వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

160 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి - భోగాపురం

జిల్లా అంధత్వ నివారణ సంఘం సహకారంతో భోగాపురం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక సాయి మందిరం వద్ద గురువారం ఉచిత కంటి శస్త్ర చికిత్సా శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 160 మందిని పరీక్షించి వారిలో 54 మందిని ఆపరేషన్ల కోసం విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా సాయి సేవసమితి సభ్యులు మాట్లాడుతూ నాలుగు నెలలకొకసారి భోగాపురం సాయి సేవాసమితి వారితో నిర్వహించే ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మోపాడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అప్తాల్మిక్ అధికారి మజ్జి గణపతిరావు పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి కంటి వైద్యనిపుణులు డాక్టర్ సువర్ణ వైద్య పరీక్షలు నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ క్యాంప్ కోఆర్డినేటర్ సాయికుమార్, సాయిసేవా సమితి కన్వీనర్ కృష్ణారావు సేవలందించారు.

రైతులకు విత్తనాలు పంపిణీ

భోగాపురం : మండలంలోని పోలిపల్లి రైతు భరోసా కేంద్రంలో గురువారం రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, మండల టిడిపి అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ మాట్లాడుతూ రాయితీపై ప్రభుత్వం అందజేస్తున్న ఈ విత్తనాలను రైతులు సక్రమంగా వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కర్రోతు రామకృష్ణ, జనసేన నాయకులు పల్లి సత్యవతి, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కౌలురైతులు దరఖాస్తు చేసుకోండి : ఎడి



సదస్సులో మాట్లాడుతున్న ఎడి కోటేశ్వరరావు

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

2024 సంవత్సరానికి కౌలురైతులను గుర్తించుటకు దరఖాస్తులు చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఎడి శ్యామసుందర్ కోరారు. గురువారం మెట్టవలస రైతు భరోసా కేంద్రంలో రైతులతో ఆయన మాట్లాడారు. కౌలుదారు కార్డులు జారీ కోసం బొబ్బిలి మండలంలో ఈ నెల 4 నుండి పదో తేదీ వరకు ప్రతి రైతు భరోసా కేంద్ర పరిధిలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మెట్టవలస విఎఎ బి.రాజశేఖర్, విఆర్ఒ భాను పాల్గొన్నారు.

నెల్లిమర్ల: రైతులకు పంట సాగు హక్కు పత్రాలపై గురువారం సీతారామునిపేట సచివాలయంలో వ్యవసాయ శాఖ అవగాహన సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఎన్. కోటేశ్వరరావు మాట్లాడుతూ పత్రాలు పొందడానికి ఎవరు అర్హులు, మంజూరు, కాలపరిమితి ప్రయోజనాలు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఎం. పూర్ణిమ, ఎఇఒ ఎం. నాగరాజు, పంచాయతీ సెక్రటరీ అనుషా, విఎఎ శ్యామ్, మాజీ సర్పంచ్ రాంబరికి రామారావు, వైస్ సర్పంచ్, రైతులు పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని గుణుపూర్‌పేటలో కౌలు రైతు గుర్తింపు సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఒ నిర్మల మాట్లాడుతూ కౌలు రైతులు ప్రతి ఒక్కరూ పేర్లు నమోదు చేసుకొని గుర్తింపు కార్డు పొందాలన్నారు. గ్రామ కార్యదర్శి, సర్పంచ్ పైల ముత్యాలరావు, రైతులు పాల్గొన్నారు.

బాడంగి : మండలంలోని గొల్లాది, గజరాయనివలస రైతు సేవా కేంద్రాల్లో కౌలురైతుల గుర్తింపు సభలను గురువారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎఒ శిరీషా మాట్లాడుతూ సిసిఆర్‌సి వల్ల కౌలురైతుకు పంట అమ్మకానికి, పంట నష్ట బీమా, విత్తనాలు, ఎరువులు, ప్రభుత్వ పథకాలు పొందటానికి అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాజారావు, సర్పంచ్ గౌరి, పాల్గొన్నారు.

రేగిడి : కౌలు రైతుల గుర్తింపు కార్డుతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయ మండల అధికారి గిరడ మురళీకృష్ణ అన్నారు. గురువారం కొమిరి, ఖండ్యాం తదితర గ్రామాల్లో రైతులకు గుర్తింపు కార్డులు పంపిణీచేశారు.




విద్యార్థులకు కిట్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

ప్రభుత్వ విద్యకు ప్రాధాన్యత : బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

విద్యకు ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. గురువారం కోమటిపల్లి గురుకుల పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు, షూస్, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యకు తొలి ప్రాధాన్యత ఇస్తుందనడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మెగా డిఎస్‌సిపై తొలి సంతకం చేయడమే నిదర్శనమని తెలిపారు. విద్యార్థుల ంతా ఉత్తమ విద్యను అందుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ త్రినాథనాయుడు, ఎంఇఒ సిహెచ్ లక్ష్మణరావు, శ్రీనివాసరావు ఎంపిడిఒ రవికుమార్, ప్రిన్సిపల్ జి.పురుషాధి, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : క్రమశిక్షణతో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. పట్టణంలోని పాతబొబ్బిలి మున్సిపల్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చోడిగంజి రమేష్ నాయుడు, ఎంఇఒ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

లాభసాటి పంటలను ప్రోత్సహించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుర్ల

రైతులకు లాభసాటిగా ఉండే పంటలను ప్రోత్సాహించాలని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. గురువారం ఆయన మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపిడిఒ వెంకటరమణ అధ్యక్షత వహించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లడుతూ వరి, రాగులు, మొక్కజొన్న, అపరాలు పంటలను సీజన్‌కు అనుకూలంగా రైతులతో పంటలు వేయించాలన్నారు. ముందుగా వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి తిరుపతి రావు మాట్లడుతూ మండలంలో ఈ ఖరీఫ్‌లో వరిసాగు 8,860 ఎకరాలలో చేసేందుకు రైతులు సిద్ధపడుతున్నారన్నారు. రైతులకు 80శాతం వరకు వరి విత్తనాలు పంపిణీ చేశామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తోటపల్లి సాగునీటి ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు అందించేందుకు సన్నాహాలు జరుగుతున్నా యన్నారు. కాలువలలో పిచ్చి మొక్కలు తొలగించడానికి రూ.20 లక్షలు నిధులు మంజూరైనట్లు ఆయన తెలిపారు. సాగునీటి ప్రాజెక్ట్ అధికారులు పనులను వేగవంతం చేయాలన్నారు. ఇరవై రోజులలో కాలువుల ద్వారా నీటిని విడుదల చేస్తామని అధికారులు చెప్పారు. పౌరసరఫరాల శాఖ ద్వారా అందిస్తున్న బియ్యం లబ్ధిదారులకు సక్రమంగా అందుతున్నాయ లేదా అన్న విషయాన్ని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరగ కుండా చూడాలని ఎపిఒను ఆదేశించారు. తాగునీటి సమస్య లేకుండా చూడాలని ట్యాంక్‌లో క్లోరినేష చేయడం, వాటిని ప్రతి15 రోజులకు ఒక్కసారి శుభ్రం చేయాలన్నారు. విద్యుత్, విద్యా, తదితర శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రామ్ మల్లిక్ నాయుడు, బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి వెన్నె సన్యాసి నాయుడు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ తిరుముల రాజు కిరణ్ కుమార్, టిడిపి మండల అధ్యక్షుడు చనమల్ల మహేశ్వర రావు, జనసేన నాయకులు శ్రీనివాసరావు, రమేష్ రాజు, కోట్ల కృష్ణ, ఎంపిడిఒ వెంకటరమణ, తహశీల్దార్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.